# మాజీ ఎంపీ మల్లు రవికి మహాత్మాగాంధీ పురస్కారం

రవీంద్రభారతి,డిసెంబర్13 : కళలు, కళాకారులు, ఆట, పాటలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, ప్రాచీన కళలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత కళాకారులపై ఉందని సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సీల్‌వెల్ కార్పొరేషన్, శృతి లయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ మల్లు రవికి మహాత్మాగాంధీ స్ఫూర్తి పురస్కారం బహూకరణ కార్యక్రమం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రాచీన కళలు మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తాయని చెప్పారు. పాశ్చాత్య సంస్కృతి విష వలయం నుంచి భవిష్యత్ తరాలను తప్పించి, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించాలన్నారు. ఆ దిశగా తమ ప్రభుత్వం కళలను, కళాకారులకు చేయూతనిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండి బండారు సుబ్బారావు, శ్రుతిలయ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ బొక్క భీంరెడ్డి, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞశర్మ, మహ్మద్ రఫీ, కుసుమ భోగరాజు తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు నవరస గాయని ఆమని బృందంచే సీల్‌వెల్ సినీ సుస్వరాలు –52 కార్యక్రమం వీక్షకులను మంత్రముగ్ధులను చేసింది.


మాజీ ఎంపీ మల్లు రవికి మహాత్మాగాంధీ పురస్కారాన్ని బహూకరిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



## శతమానం భవతి

బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యులు కే.కేశవరావు పుట్టినరోజును పురస్కరించుకుని బుధవారం బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో ఎంపీ కేకే, మేయర్ విజయలక్ష్మిని గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు

– బంజారాహిల్స్, డిసెంబర్ 13



రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖను జూబ్లీహిల్స్‌లోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేస్తున్న లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి ఆలయ మాజీ చైర్మన్ కే.వెంకటేశ్

– చాంద్రాయణగుట్ట, డిసెంబర్13



## పరాంకుశంకు కీర్తి పురస్కారం

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2021కుగాను ప్రకటించిన కీర్తి పురస్కారాన్ని సీనియర్ పాత్రికేయులు పరాంకుశం వేణుగోపాల స్వామికి బుధవారం అందజేస్తున్న వర్సిటీ వీసీ ఆచార్య టి. కిషన్‌రావు, రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్, విస్తరణ సేవా విభాగం ఇన్‌చార్జి రింగు రామ్మూర్తి తదితరులు

– తెలుగు యూనివర్సిటీ

## రేపు బాపురమణల పురస్కారాల ప్రదానం

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 13 : ఈ నెల 15న పద్మశ్రీ బాపు జయంతి సందర్భంగా బాపురమణ అకాడమీ ఆధ్వర్యంలో పలువురు సాహితీవేత్తలకు బాపురమణ పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహిస్తున్నట్లు అకాడమీ ప్రధాన కార్యదర్శి వేగిరాజు సుబ్బరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సారస్వత పరిషత్‌లో జరిగే ఈ కార్యక్రమంలో 2023కుగాను పురస్కారాలను ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ ఏలే లక్ష్మణ్, ప్రముఖ రచయిత మాడభూషి దివాకరబాబుకు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించారు. మధుర స్నేహ పురస్కారాలను చిత్రకారులు ఖరిడేహాల్ వేంకట భీమారావు, రచయిత కల్లూరి సత్యరామ ప్రసాద్‌లకు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ప్రముఖ రచయిత, నటులు తనికెళ్ల భరణి రచించిన శివ చిలుకలు, ముళ్ళపూడి వెంకట రమణ రచన బుడుగు, సత్యమూర్తి కార్టూన్‌ల పుస్తకం రాముసోము, ప్రసాద్ కార్టూన్స్ రచన కార్టూన్ కాజాలు పుస్తకాలను ఈ సందర్భంగా ఆవిష్కరిస్తారని వెల్లడించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ కే.వీ రమణాచారి, రచయిత తనికెళ్ల భరణి, దర్శకులు రేలంగి నరసింహారావు, కవి సుద్దాల అశోక్ తేజ, నటులు డాక్టర్ సుదర్శన్, నటి ఆమని, నటులు రాజీవ్ కనకాల, చిత్రకారులు ఆనంద్ గడప తదితర సాహితీవేత్తలు పాల్గొంటారని సుబ్బరాజు తెలిపారు.

# దేశాభివృద్ధిలో గ్రామీణ ప్రాంతాలే కీలకం

వ్యవసాయ యూనివర్సిటీ, డిసెంబర్ 13 : గ్రామీణాభివృద్ధి కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇవ్వడం హర్షనీయమని ఎన్ఐఆర్‌డీ పీఆర్ డైరెక్టర్ జనరల్ డా. నరేంద్రకుమార్ అన్నారు. బుధవారం రాజేంద్రనగర్ ఎన్ఐఆర్‌డీ పీఆర్‌డి సమావేశపు మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్, జీబీ పంత్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ ఎన్విరాన్‌మెంట్ బృందం ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు ఎంవోయూపై సంతకం చేశారు. ఎన్ఐఆర్‌డీపీఆర్ రిజిస్ట్రార్ మనోజ్‌కుమార్, సహజ వనరుల నిర్వహణ, వాతావరణ మార్పు, విపత్తు నిర్వహణ కేంద్రం హెడ్ డా. రవీంద్రగావలి, డా. కేశవరావు, డా. కతిరేసన్ , ఎన్ఐహెచ్ఈ డైరెక్టర్ సునిల్‌నౌటియాల్, జగదీశ్ చంద్ర తదితరులు పాల్గొని సుదీర్ఘ చర్చ జరిపారు. వ్యవసాయ ఆధారిత జీవనోపాధి వ్యూహాలు, తదితర అంశాలపై చర్చించారు. దేశ అభివృద్ధిలో గ్రామీణ ప్రాంతాలదే కీలక పాత్ర అని, పల్లెలు అభివృద్ధి జరిగితేనే దేశ అభివృద్ధి అని సూచించారు. ప్రధానంగా వ్యవసాయ, అనుబంధ రంగాలను వీలైనంత వరకు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.


రాజేంద్రనగర్ ఎన్ఐఆర్‌డీ సమావేశ మందిరంలో ఒప్పంద పత్రాలను చూపిస్తున్న అధికారులు


బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.రాజేశ్వర్‌యాదవ్

## ఉప ముఖ్యమంత్రి పదవి బీసీలకు ఇవ్వాలి

రవీంద్రభారతి, డిసెంబర్ 13 : రాష్ట్ర జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వడంతోపాటు కేబినెట్ విస్తరణలో 50 శాతం మంత్రి పదవులు ఇవ్వాలని తెలంగాణ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాజేశ్వర్‌యాదవ్ అన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ జనాభాలో 52 శాతం ఉన్న బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవితోపాటు విస్తరించే మంత్రి పదవుల్లో 50 శాతం ఇవ్వాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సోనియాగాంధీ, రాహులగాంధీ,కేసీ వేణుగోపాల్‌కు వినతిపత్రాలు సమర్పించామని తెలిపారు. అలాగే నామినేటెడ్ పదవుల్లోనూ 50 శాతం బీసీలకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీసీ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, ప్రవీణ్‌కుమార్, పూసల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి ఈ-మెట్రో ఏసీ బస్సులు

- సికింద్రాబాద్-పటాన్‌చెరువు మధ్యలో షురూ
- ఆర్టీసీ గ్రేటర్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ వెల్లడి

సిటీబ్యూరో, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : నగరంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏసీ బస్సులను పునరుద్ధరిస్తూ ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయం తీసుకున్నది. ఈ నెల 15 నుంచి సికింద్రాబాద్ నుంచి పటాన్‌చెరువు (రూట్ నంబర్ 219)మధ్య ఎనిమిది ఈ–మెట్రో ఏసీ బస్ సర్వీసులను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఆర్టీసీ గ్రేటర్ జోన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ వి. వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రతి 24 నిమిషాలకు ఒక బస్ సర్వీసు చొప్పున సికింద్రాబాద్ నుంచి వయా ప్యారడైస్, బోయిన్‌పల్లి, బాలానగర్, కూకట్‌పల్లి మీదుగా వీటిని నడిపిస్తారు. సికింద్రాబాద్ నుంచి ప్రతి రోజు ఉదయం 6.10 గంటలకు ప్రారంభమవుతుంది. చివరి బస్సు రాత్రి 8.28 గంటలకు సర్వీసు ఉంటుందన్నారు. అలాగే పటాన్‌చెరువు నుంచి తొలి బస్సు ఉదయం 7.45 కు బయలుదేరుతుందని, చివరి సర్వీసు 10.03 గంటలకు ఉంటుందన్నారు.

# బయోకేర్ ప్రాజెక్టుకు డా. శివప్రియ ఎంపిక

సిటీబ్యూరో, డిసెంబర్ 13(నమస్తే తెలంగాణ) : సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్‌లో సీనియర్ రీసెర్చ్ అసోసియేట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న డా. శివప్రియ పావులూరి డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ అందించే ప్రాజెక్టుకు ఎంపికైంది. లైఫ్ సైన్స్ రంగంలో మహిళల భాగస్వామ్యం పెంచడమే లక్ష్యంగా డీబీటీ ప్రెస్టీజియస్ బయోకేర్ ప్రాజెక్టులతో ప్రోత్సహిస్తోంది. లైఫ్ సైన్స్, వ్యవసాయం, పశు వైద్య అధ్యయనాల్లో మహిళ పరిశోధకులకు అవసరమైన నిధులను గ్రాంట్ రూపంలో సమకూర్చుతోంది. ఈ క్రమంలో సీనియర్ రీసెర్చ్ అసోసియేట్‌గా సేవలు అందిస్తున్న డా. పావులూరి శివప్రియ ప్రెస్టీజియస్ బయోకేర్ ప్రాజెక్టుకు ఎంపికైనట్లుగా సీడీఎఫ్‌డీ వర్గాలు వెల్లడించాయి.


కీసరగుట్ట ఆలయ ప్రాంగణమందిరంలో హుండీని లెక్కిస్తున్న కీసరగుట్ట, ఎండోమెంట్ సిబ్బంది

# కీసరగుట్టలో కార్తికమాసం ఆదాయం

## ₹ 1,06,71,839

కీసర, డిసెంబర్ 13 : కీసరగుట్ట భవానీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తికమాసం (నవంబర్ 14 నుంచి డిసెంబర్ 12 వరకు)కు సంబంధించి హుండీని బుధవారం కీసరగుట్ట ఆలయ ప్రాంగణమందిరంలో లెక్కించారు. ఎండోమెంట్, కీసరగుట్ట ఆలయం వారి ఆధ్వర్యంలో జరిగిన లెక్కింపులో స్వామివారి టికెట్ల ద్వారా రూ.83,93,603లక్షలు, హుండీ ద్వారా రూ.22,78,236లక్షలు మొత్తం రూ. 1,06,71,839 కోట్ల రూపాయల ఆదాయం వచ్చిందని కీసరగుట్ట ఆలయ చైర్మన్ తటాకం రమేశ్ శర్మ తెలిపారు.